ఉద్యోగిపై రైతుల ఫిర్యాదు

యద్దనపూడి: రాయితీపై రైతులకు ఇచ్చే శనగ విత్త నాల నగదును తీసుకొని ఆర్బీకే ఉద్యోగి పరారైన ఘటన మండలంలోని అనంతవరం గ్రామంలోని రైతుభరోసా కేంద్రంలో జరిగింది. వ్యవసాయాధికారి చల్లగుండ్ల ఆదినారాయణ, బాధిత రైతులు వివరాల మేరకు.. అనంతవరం ఆర్బీకేలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కాసా దానియేలు 15 రోజుల క్రితం ప్రభుత్వం రైతులకు రాయితీపై ఇస్తున్న శనగ విత్తనాలకు సంబంధించి రూ.3 లక్షలకు పైగా రైతుల వద్ద వసూలు చేసిన నగదును బ్యాంకులో జమ చేయకుండా ఉడాయించాడు. అలాగే పక్క మండలాల, గ్రామాలకు చెందిన రైతుల వద్ద తక్కువ రేటుకు శనగ విత్తనాలు ఇప్పిస్తానంటూ మరో రూ.3 లక్షలకు పైగా ఫోన్‌పే ద్వారా నగదును తన ఫోన్‌కు బదిలీ చేయించుకున్నాడు. విషయం తెలిసిన రైతులు ఏవో దృష్టికి తీసుకు రాగా ఆయన జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాడు. ఏఓ రైతులతో కలిసి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అబుల్ కలాం సేవలు చిరస్మరణీయం

సాక్షి నెట్‌వర్క్: భారత తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశానికి చేసిన సేవలు మరువలేనివని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరంలో ఆయన పోరాటాలు అద్భుతమని.. నేటి తరం ఆయన చూపిన అడుగుజాడల్లో నడవాలని పేర్కొన్నారు. ఈసందర్భంగా చీరాల, అద్దంకి, పర్చూరులో పలు గ్రంథాలయాల్లో, స్వచ్ఛంద సంస్థలు అబుల్ కలాం చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆజాద్ చరిత్ర గురించి విద్యార్థులకు వివరించారు. విద్యావేత్త మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని శనివారం వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ పోతుల సునీత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కొత్తపేటలోని ఆమె నివాసం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముస్లిం మైనార్టీ నాయకులు, మాజీ కౌన్సిలర్ బుల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.



ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ఎమ్మెల్సీ సునీత

బాణసంచా కొనుగోళ్లలో జాగ్రత్తలు అవసరం

చీరాల అర్బన్: బాణసంచా కాల్చే సమయంలో సరైన జాగ్రత్తలు పాటించాలని సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి వీవీ రామకృష్ణ సూచించారు. చీరాల ఎన్ఆర్ పీఎం హైస్కూల్ ఆవరణలో బాణాసంచా దుకాణాలను ఏర్పాటు చేశారు. చీరాల, పర్చూరు నియోజకవర్గాల్లో హోల్‌సేల్ షాపులు ఉన్నాయి. 15 రోజులుకు ముందే దీపావళి బాణాసంచా కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాల వద్ద ఎటువంటి అగ్నిప్రమాదం జరగకుండా ముందస్తుగా అగ్నిమాపక సిబ్బంది ఔట్‌పోస్టు ఏర్పాటు చేశారు. ఏదైనా ప్రమాదం జరిగితే సమీపంలోని అగ్నిమాపక కేంద్రం నంబర్ 08594-232299 నంబర్, అగ్నిమాపక అధికారి 99637 33109కు సంప్రదించాలన్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అంతా సంక్షేమమే

చీరాల: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతో ప్రజలకు అంతా సంక్షేమమే జరుగుతుందని మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు అన్నారు. శనివారం పట్టణంలోని క్లస్టర్-1 హరిప్రసాద్‌నగర్ సచివాలయ పరిధిలో పార్టీ ఆదేశాల మేరకు ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ సూచనల మేరకు ఆంధ్రప్రదేశ్‌కి జగనన్న ఎందుకు కావాలంటే అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, పట్టణపార్టీ అధ్యక్షులు-1 కొండ్రు బాబ్జి, పట్టణ అధ్యక్షులు-1 గుంటూరు మాధవరావు, జేసీఎస్ పట్టణ ఇన్‌చార్జ్ కోలా శివ, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు చీమకుర్తి బాలకృష్ణ, జిల్లా కార్యదర్శి శిఖా సురేష్, మున్సిపల్ కౌన్సిలర్లు బత్తుల అనిల్, గోలి స్వాతి, కె.యానాదిరావు, కో-ఆప్షన్ మెంబర్ షేక్ కబీర్, పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్‌కి జగనన్నే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని శనివారం చీరాల రూరల్ మండలం ఈపూరుపాలెం-2 సచివాలయం పరిధిలో నిర్వహించారు. కార్యక్రమంలో అర్బన్ ఫైనాన్స్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు, చీరాల మండల పార్టీ అధ్యక్షుడు ఆసాది అంకాలరెడ్డి, జేసీఎస్ మండల ఇన్‌చార్జి బుర్ల సాంబశివరావు, ఆర్బీకే చైర్మన్ కావూరి రమణారెడ్డి, వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్ బోయిన కేశవులు, ఎస్టీ సెల్ అధ్యక్షుడు నల్లబోతుల రాజ్‌కుమార్, బిట్రా శ్రీనివాసరావు, పర్వతనేని శ్రీనివాసరావు, ఎ.నారాయణ, గుంటూరు వెంకటసుబ్బారావు, గుర్రం బుజ్జి, బుర్ల మురళి తదితరులు పాల్గొన్నారు.

వెంకటేష్‌ను పరామర్శించిన నాయకులు

చినగంజాం: ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై సోమాజిగూడ యశోద హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న చీరాల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్‌ను పర్చూరు వైఎస్సార్‌సీపీ నాయకులు శనివారం పరామర్శించారు. ఆయనను పరామర్శించిన వారిలో నియోజకవర్గ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పాలెపోగు రాంబాబు, చినగంజాం ఎంపీపీ కోమట్ల అంకమ్మరెడ్డి, నూతలపాడు మాజీ పీఏసీ చైర్మన్ కుర్రి బాపిరెడ్డిలు ఉన్నారు.



వెంకటేష్‌ను పరామర్శిస్తున్న పర్చూరు నాయకులు

బైకును ఢీకొట్టిన కారు

బల్లికురవ: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టడంతో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈఘటన శుక్రవారం రాత్రి పసుమర్రు మేజర్ కాలువ వద్ద జరిగింది. అందిన వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా వెలిగండ్ల మండలం వెదుళ్ల చెరువు గ్రామానికి చెందిన మునగాల్ల శ్రీనివాసరెడ్డి అద్దంకి నుంచి బల్లికురవ మీదుగా కొప్పరపాలెం బైకుపై వెళ్తున్నాడు. ఈక్రమంలో సంతమాగులూరు నుంచి బల్లికురవ వైపు వస్తున్న కారు కాలువ వద్ద ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైకు నడుపుతున్న శ్రీనివాసరెడ్డి గాయాలపాలయ్యాడు. క్షతగాత్రుడిని స్థానికులు చికిత్స నిమిత్తం నరసరావుపేటలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.



